## మక్తల్ ఎమ్మెల్యేగా వాకిటి శ్రీహరి

ఊట్కూర్, డిసెంబర్ 3 : మక్తల్ ఎమ్మెల్యేగా వాకిటి శ్రీహరి గెలుపొందారు. ఆదివారం నారాయణపేట మండలంలోని సింగారం క్రాస్‌రోడ్డులోని దత్త బృందావనం టీటీసీ కళాశాలలో ఓట్ల లెక్కింపు నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి వాకిటి శ్రీహరి సమీప బీఆర్ఎస్ అభ్యర్థి చిట్టెం రామ్మోహన్‌రెడ్డిపై 17,525 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఎన్నికల్లో శ్రీహరికి 74,917 రాగా చిట్టెం రామ్మోహన్ రెడ్డికి 57,392 ఓట్లు, బీజేపీ అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్‌రెడ్డికి 45,455 ఓట్లు పోలయ్యాయి. బీఎస్పీ అభ్యర్థి వర్కటం జగన్నాథ్‌రెడ్డికి 2,454, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి 877 ఓట్లు, డీఎస్పీ అభ్యర్థికి 940ఓట్లు వచ్చాయి. ఎన్నికల్లో వివిధ శాఖలకు చెందిన 958మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## పేట ఎమ్మెల్యేగా పర్ణికారెడ్డి



రిటర్నింగ్ అధికారితో ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న పర్ణికారెడ్డి

నారాయణపేట, డిసెంబర్ 3: నారాయణపేట నియోజకవర్గ ఎమ్మెల్యేగా కాంగ్రెస్ అభ్యర్థి పర్ణికారెడ్డి గెలుపొందారు. ఆమె తన సమీప బీఆర్ఎస్ అభ్యర్థి రాజేందర్‌రెడ్డిపై బ్యాలెట్ ఓట్లు కలుపుకొని 7,950ఓట్ల అధిక్యంతో గెలుపొందారు. నారాయణపేట నియోజకవర్గంలో మొత్తం 2,31,896ఓట్లు ఉండగా, 1,81,709 ఓట్లు పోలయ్యాయి. ఇందులో కాంగ్రెస్ అభ్యర్థి పర్ణికారెడ్డికి 84,705 ఓట్లు రాగా, బీఆర్ఎస్ అభ్యర్థి రాజేందర్‌రెడ్డికి 76,755 ఓట్లు వచ్చాయి. అదేవిధంగా బీజేపీ అభ్యర్థి రతంగపాండురెడ్డికి 15,075, బీఎస్పీ పార్టీ అభ్యర్థి బొదిగెల శ్రీనివాసులుకు 2,468, ధర్మజాగరన్ పార్టీ అభ్యర్థి ఈశ్వర్‌కు 919, ఇండిపెండెంట్ అభ్యర్థి రాజేందర్‌రెడ్డికి 1082, మరో స్వతంత్ర్య అభ్యర్థి సత్యనారాయణకు 370, నోటాకు 1512 ఓట్లు వచ్చాయి.

## వైభవంగా కురుమూర్తి బ్రహ్మోత్సవాలు

- నేడు స్వామివారి అలంకరణ తొలగింపు
- రేపు హుండీ లెక్కింపు



స్వామి దర్శనం కోసం క్యూలైనులో బారులు తీరిన భక్తులు

దేవరకద్ర రూరల్(చిన్న చింతకుంట) డిసెంబర్ 3 : ఉమ్మడి పాలమూరు జిల్లాలోని చిన్న చింతకుంట మండలం అమ్మాపూర్ గ్రామ సమీపంలో పేదల తిరుపతిగా పేరుగాంచిన కురుమూర్తి కొండల నడుమ కాంచన గుహలో కొలువైన కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. కార్తీకమాసం అలాగే సెలవుదినం కావడంతో ఆదివారం భక్తులు పెద్దఎత్తున కురుమూర్తి కొండకు తరలివచ్చారు. భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారికి నైవేద్యాలు చేసి సమర్పించారు. దాసరులకు దాసంగాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు స్వామి దర్శనానికి ముందు స్వామి వారి ఉద్దాలను దర్శించుకొని, ఉద్దాలతో తలపై కొట్టించుకుంటే పీడలు తొలగుతాయని భక్తుల విశ్వాసం. సోమవారం ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజల అనంతరం అలంకరణ తొలగించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. అదేవిధంగా మంగళ వారం స్వామి వారి హుండీని లెక్కించనున్నట్లు పేర్కొన్నారు.

## బీఆర్ఎస్ అభ్యర్థి వాహనంపై
## కాంగ్రెస్ నాయకుల రాళ్ల దాడి

నారాయణపేట, డిసెంబర్ 3: నారాయణపేట బీఆర్ఎస్ అభ్యర్థి పై ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, ఆయన సోదరుడు రవీందర్‌రెడ్డి వాహనాలపై కాంగ్రెస్ నాయకులు రాళ్ల దాడి చేశారు. దీంతో వారి వాహనాల అద్దాలు పగిలిపోయాయి.

# ఉద్యమ వీరుడికి ఘననివాళి

ఖిల్లాఘణపురం, డిసెంబర్ 3 : తెలంగాణ మలిదశ ఉద్యమానికి ఊపిరిపోసిన తెలంగాణ వీరుడు శ్రీకాంతాచారి వర్ధంతిని సామాజిక కార్యకర్త కమ్మరి గోపి ఆధ్వర్యంలో ఆదివారం మండలకేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో నిర్వహించారు. ముందుగా శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2009లో ఉద్యమం ఊపందుకున్న సమయంలో కేసీఆర్ అరెస్ట్‌కు నిరసనగా శ్రీకాంతాచారి తన ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని ఉద్యమజ్వాలను రగిల్చి అగ్నికి ఆహుతి అవుతూ జై తెలంగాణ అంటు నినాదించాడని గుర్తుచేశారు. ఐదురోజులపాటు మృత్యువుతో పోరాడి తెలంగాణ ఉద్యమంలో తన ఊపిరిని వదిలాడన్నారు. శ్రీకాంతాచారి మృతితో 4కోట్ల తెలంగాణ ప్రజల్లో ఉద్యమ జ్వాలలు రగిలాయన్నారు. తెలంగాణ ప్రజల గుండెల్లో శ్రీకాంతాచారి చిరస్మరణీయంగా నిలిచిపోయాడన్నారు. కార్యక్రమంలో బండారి మల్లేష్, రాజు, రమేశ్ ఉన్నారు.



ఖిల్లాలో శ్రీకాంతాచారి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



జిల్లా కేంద్రంలో శ్రీకాంతాచారి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉద్యోగ, ప్రజా సంఘాల నేతలు

### వనపర్తి పట్టణంలో..

వనపర్తి టౌన్, డిసెంబర్ 3 : తెలంగాణ మలిదశ ఉద్యమ జ్వాల తొలి అమరుడు శ్రీకాంతాచారి వర్ధంతిని ఆదివారం ఉద్యోగ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజా వాగ్గేయకారుడు రాజారాంప్రకాశ్ మాట్లాడుతూ తెలంగాణ మలిదశ ఉద్యమానికి చైతన్యం నింపేందుకు ఆత్మబలిదానం చేసుకున్నాడని శ్రీకాంతాచారి పోరాటస్ఫూర్తిని రగిలించారన్నారు. ఎల్‌బీ నగర్ చౌరస్తాలో ప్రజల సమక్షంలోనే అంబేద్కర్, జగ్జీవన్‌రావు విగ్రహాల సాక్షిగా ఒంటిపై పెట్రోల్ పోసుకొని తనకు తాను ఆత్మార్పణ చేసుకున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో వ్యాఖ్యాత నాయకంటి నర్సింహాశర్మ, మండ్ల దేవన్ననాయుడు, చుక్క రాజు, తగుళ్ల వెంకటస్వామి, పరమేశ్వరాచారి, గంగాధరాచారి, సత్యంచారి, వెంకటేశ్వరాచారి, అశోక్‌చారి, కిరణ్‌చారి, వేణుచారి, కిరణ్‌చారి తదితరులు ఉన్నారు.

# ప్రతి రౌండ్‌లో ఉత్కంఠ





జిల్లా కేంద్రం సమీపంలోని చిట్యాల ఏఎంసీ గోదాంలో నియోజకవర్గానికి సంబంధించి ఓట్లు లెక్కిస్తున్న ఎన్నికల సిబ్బంది

వనపర్తి, డిసెంబర్ 3 : వనపర్తి నియోజకవర్గానికి సంబంధించిన ఓట్ల లెక్కింపు మొత్తం 22రౌండ్లు నిర్వహించారు. ప్రతి రౌండ్‌లో ఫలితాలను అధికారులు కొంత అలస్యంగా వెల్లడించడంతో ప్రజలు, కార్యకర్తల్లో ఉత్కంఠ నెలకొంది. ఆదివారం జిల్లా కేంద్రంలోని చిట్యాల ఏఎంసీ గోదాంలో వనపర్తి నియోజకవర్గానికి సంబంధించిన 296 బూత్‌ల ఓట్ల లెక్కింపును 22రౌండ్లుగా అధికారులు లెక్కించారు. ఓట్ల లెక్కింపు క్యాక్రమాన్ని అధికారులు ఉదయం 8:30గంటలకు ప్రారంభించారు. మొదటి రౌండ్‌లో మొదటగా బీఆర్ఎస్ అభ్యర్థికి 5065రాగా, కాంగ్రెస్ అభ్యర్థికి 4348 ఓట్లు రావడంతో బీఆర్ఎస్ అభ్యర్థి 717 ఆధిక్యంగా నిలిచారు. అలాగే రెండు నుంచి నాలుగో రౌండ్ వరకు బీఆర్ఎస్ అభ్యర్థి మెజార్టీలో ఉండగా, ఐదో రౌండ్‌లో కాంగ్రెస్ అభ్యర్థికి 6352ఓట్లు రాగా, బీఆర్ఎస్ అభ్యర్థికి 3965ఓట్లు రావడంతో 2387 మెజార్టీ వచ్చింది. అక్కడి నుంచి వరుసగా 22రౌండ్ల వరకు కాంగ్రెస్ అభ్యర్థికి మెజార్టీ పెరుగుతూ 24,200 వచ్చింది. చివరిగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపులో మొత్తం 2573 ఓట్లు కాగా వాటిలో బీఆర్ఎస్ అభ్యర్థికి 526 ఓట్లు పోల్ అవ్వగా, కాంగ్రెస్ అభ్యర్థికి 1,646 ఓట్లు పోలయ్యాయి.

దీంతో నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి తూడి మేఘారెడ్డికి 25,846 ఓట్ల మెజార్టీతో ప్రత్యర్థి బీఆర్ఎస్ అభ్యర్థి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిపై గెలిచినట్లు రిటర్నింగ్ అధికారి తిరుపతిరావు ప్రకటించారు.

# ప్రశాంతంగా ముగిసిన ఎన్నికల కౌంటింగ్



ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ, కలెక్టర్

వనపర్తి టౌన్, డిసెంబర్ 3 : జిల్లాకేంద్రంలోని చిట్యాల సమీపంలోని మార్కెట్ యార్డ్‌లో ఆదివారం నిర్వహించిన ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. 137మంది కేంద్ర, రాష్ట్ర బలగాలతో కట్టుదిట్టమైన భద్రత చేపట్టినట్లు ఎస్పీ రక్షితా కృష్ణమూర్తి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. ప్రత్యేక భారీ కేడ్లను ఏర్పాటు చేశామని, ఎలాంటి అల్లర్లు, గొడవలకు తావివ్వకుండా ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టామన్నారు. ప్రశాంతంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియను ముగించిన జిల్లా అధికారులకు, అందుకు సహకరించిన ప్రజలకు ఎస్పీ రక్షితాకృష్ణమూర్తి అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు.



కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీస్ సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ రక్షితామూర్తి